

కాలువ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

కాలువ మరమ్మతులు పూర్తిచేయాలి: పద్మావెంకట్‌రెడ్డి

నల్లకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జుననగర్ బస్తీలో చేపడుతున్న వర్షంనీటి కాలువ మరమ్మతు పనులు త్వర గా పూర్తిచేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో జరుగుతున్న వర్షం నీటి కాలువ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈ పనులు సత్వరం పూర్తి చేసినట్లయితే స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెత్త, వ్యర్థాల తొలగింపు



శ్మశానవాటికలో చెత్త, చెదారం, వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

నల్లకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : దీపావళిని పురస్కరించుకుని తరతరాలుగా వస్తున్న ఆచారాలను గౌరవిస్తూ అంబర్‌పేట ప్రజలు తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడం పరిపాటి అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాగ్ అంబర్‌పేటలోని మోహిన్‌చెరువు వద్ద గల శ్మశానవాటికలో చె త్త, చెదారం, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను ఎత్తివేసి పరిశుభ్రం చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం మోహిన్‌చెరువులో చెత్త, మట్టి కుప్పలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎత్తివేయడాన్ని ఆయన పరిశీలించి మా ట్లాడారు. ఈ హిందూ శ్మశానవాటికలో దట్టంగా అలుముకుని ఉన్న చెట్ల పొదలను, వీధి దీపాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎత్తివేయించారని పేర్కొన్నారు.

వాలీబాల్ గ్రౌండ్‌లో అత్యాధునిక సౌకర్యాలు

- కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్



వాలీబాల్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్

ముషీరాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోనే ప్రసిద్ధిగాంచిన ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యాధునిక సౌకర్యాలు, అభివృద్ధి పనులను చేపడుతున్నామని స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. గురువారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు కూర్చోవడానికి గ్రౌండ్‌లో గ్యాలరీ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి పరచి నగరంలో ఆదర్శ వాలీబాల్ గ్రౌండ్‌గా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, ప్రసాద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్టీసీ అరుణాచలం యాత్రను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ సురేందర్

యాత్రదానం టూర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మేనేజర్ సురేందర్

రాంనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ చేపట్టిన యాత్రదానం టూర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ డిపో మేనేజర్ సురేందర్ కోరారు. ముషీరాబాద్ డిపో ఆధ్వర్యంలో యాత్రదానం టూర్‌లో భాగంగా గురువారం చేపట్టిన అరుణాచలం యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుట్టినరోజు, వివాహ మహోత్సవం, ఇతర శుభదినం రోజుల సందర్భంగా ఎవరైనా ఆర్టీసీకి డబ్బులు చెల్లిస్తే వారి పేరుమీద ఈ యాత్ర టూర్ నిర్వహిస్తామన్నారు. ఈ విధానం ద్వారా డబ్బులు పెట్టుకుని యాత్రలకు వెళ్లని వారికి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. మన వెస్టేజీ అనే సంస్థ ఆర్థిక సహకారంతో అరుణాచలం టూర్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు జంగయ్య, లాలుప్రసాద్, ఆర్టీసీ అధికారులు నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు



రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు వెంకటేష్, దిలీప్‌యాదవ్, కుమార్‌గౌడ్

కవాడిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్‌లో రోడ్లు గుంతలమయంగా మారగా జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ గుంతలను పూడ్చివేయించారు. గురువారం పూల్‌బాగ్‌లో గుంతలమయంగా మారిన రోడ్లను పూడుస్తున్న సమయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బీజేపీ రాష్ట్ర నాయకుడు జి వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, నగర నాయకులు కుమార్‌గౌడ్ పర్యవేక్షించారు. రోడ్లపై ఉన్న అన్ని గుంతలను పూడ్చివేయించి స్థానికంగా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో బస్తీవాసులు, బీజేపీ నాయకులు జీహెచ్‌ఎంసీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పీఎస్‌లో విద్యార్థులతో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, సిబ్బంది

చిక్కడపల్లి పీఎస్‌ను సందర్శించిన విద్యార్థులు

చిక్కడపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ఆంధ్రవిద్యాలయం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ వారిని ఆహ్వానించి పోలీస్‌స్టేషన్‌లో జరిగే ప్రతి అంశంపై, కంప్లైంట్ రిసీవ్ చేసుకునే దగ్గర నుంచి ఏవిధంగా కేసు చార్జిషీట్ వరకు వెళ్తుందో వారికి క్షుణ్ణంగా వివరించారు. 100 డయల్ బ్లూకోల్ట్స్ సిబ్బంది, క్రైమ్, పెట్రోకార్స్, పోలీస్‌స్టేషన్‌లో ఫంక్షనింగ్‌లో ఉన్నటువంటి అన్ని వర్టికల్స్ గురించి వారికి వివరించారు. అలాగే విద్యార్థులను ఎలాంటి చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారికి సూచనలు చేశారు. దీనిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేయగా ఇన్‌స్పెక్టర్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ శంకర్‌నాయక్, అడ్మిన్ ఎస్ఐ అభిలాష్, ఎస్ఐ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం చేయాలి

కవాడిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం అమలుకై తెలంగాణ సమాజం రాష్ట్ర సాధన ఉద్యమ తరహాలో పోరాటం చేయాలని తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నర్సయ్య తెలిపారు. గురువారం ముషీరాబాద్ తెలంగాణ జనసమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎంఆర్‌ఐ జ్యోతికి వినతిపత్రం అందజేసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డులో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న బీసీ రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహిస్తున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని బంద్‌ను పూర్తిగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, నగర ఉపాధ్యక్షుడు కుమిరెడ్డి జైపాల్‌రెడ్డి, నాయకులు శంకర్, నారాయణ, దాసు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలందరూ మరోసారి ఉద్యమించాలి

నల్లకుంట: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకై తెలంగాణ ప్రజలందరూ మరోసారి తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమించాలని తెలంగాణ జన సమితి అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి జస్వంత్ కోరారు. ఈ మేరకు గురువారం అంబర్‌పేట తహసీల్దార్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో స్థానిక సంస్థల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు అంగీకారం తెలిపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, నవీన్, బాషా తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్‌ఐ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ జనసమితి గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్



అంబర్‌పేట తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ జన సమితి అంబర్‌పేట ఇన్‌చార్జి జస్వంత్ తదితరులు

బంద్‌కు గంగపుత్ర సంఘం సంపూర్ణ మద్దతు

చిక్కడపల్లి: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా ఈనెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర బంద్‌కు తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం(టీఆర్‌జీఎస్), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిషర్‌మెన్(ఎన్ఏఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఈ రెండు సంస్థల అధ్యక్షుడు పాక రవిప్రసాద్ గంగపుత్ర గురువారం చిక్కడపల్లిలో మాట్లాడారు. గంగపుత్ర సోదరులు, తెలంగాణలోని వెనుకబడిన తరగతుల ప్రజలు ఈ బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేసి బీసీల ఐక్యత చాటాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆర్టీసీ యాజమాన్యం, ఆటోయూనియన్‌లు, పెట్రోల్‌బంక్‌ల యాజమాన్యాలు ఈ బంద్‌లో పాల్గొని బీసీ రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించాలని పాక రవిప్రసాద్ గంగపుత్ర విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్ల పిటిషన్ కొట్టివేతకు సీఎం బాధ్యత వహించాలి

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

కవాడిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసినందుకు నైతిక బాధ్యత వహించి సీఎం రేవంత్‌రెడ్డి తమ పదవికి రాజీనామా చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. రాజీనామాతో పాటు బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు స్టే విధించడం దాన్ని వేకెట్ చేయించడానికి రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడాన్ని నిరసిస్తూ గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేయడం రేవంత్ సర్కార్‌కు చెంపపెట్టులాంటిదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాల వల్లే సుప్రీంకోర్టు పిటిషన్‌ను డిస్మిస్ చేసిందని దీంతో సీఎం పరువు పోయిందన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లేదని ఆయన ఆరోపించారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బీజేపీలోని బీసీ ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు తక్షణమే బీజేపీకి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రెడ్డి నాయకుల ద్వారా కోర్టులో పిటిషన్‌వేసి అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంపై బీసీలు తిరుగుబాటు చేసి 42శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి నరసింహచారి, గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, నాయకులు ఇటిక్యాల గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్, పార్టీ నేతలు

ఫార్మసీ ఆఫీసర్స్‌కు ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ రిలీజ్ చేయాలి

నల్లకుంట : మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పరీక్షలు రాసిన ఫార్మసీ ఆఫీసర్స్‌కు వెంటనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ రిలీజ్ చేసి అర్హత పొందిన వారికి వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్ వినతిపత్రం ఇచ్చారు. గురువారం హైదర్‌గూడలో వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. 104 సర్వీస్‌లో పనిచేసిన ఫార్మసీ ఆఫీసర్స్ అందరికీ 2025 ఏప్రిల్‌లో కంటిన్యూయేషన్ ఇచ్చి వెంటనే ఏడు నెలలు వేతనాలు ఇవ్వాలని, నాన్ నోటిఫైడ్ పోస్టులలో దగ్గరి ప్లేసెస్‌లోకి మెర్జ్ చేయాలని కోరారు. క్లియర్ వేకెన్సీ పోస్టులలో అడహక్ ప్రమోషన్స్ ఇవ్వాలని, నూతనంగా ఏర్పాటు చేసిన 23 జిల్లాల్లోని ఫార్మసీ, వాక్సిన్ స్టోర్స్‌లలో మలేరియా, లెప్రసీ స్టోర్స్‌లో జిల్లా ఫార్మసీ ఆఫీసర్ పోస్టులు శాంక్షన్ చేయాలని కోరారు. ఈ నివేదికను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తున్న బత్తిని సుదర్శన్‌గౌడ్, జాలిగామ అశోక్



పోటీల్లో పాల్గొన్న జట్లు

దోమలగూడలో ఎస్‌జీఎఫ్ఐ ఇంటర్ జిల్లా పోటీలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దోమలగూడలోని గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గురువారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ జిల్లా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మండలాలకు చెందిన జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో ఖైరతాబాద్ జోన్ జట్టు 5 విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఖోఖోలో అండర్-17, అండర్-14 బాలురు, బాలికల జట్లు మొదటి స్థానంలో నిలవగా.. కబడ్డీలో అండర్-17 బాలుర జట్టు మొదటి స్థానం సాధించింది. ఖైరతాబాద్ జోన్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జట్లు పోటీపడ్డాయి.

9న కార్తీక సమారాధన

చిక్కడపల్లి: అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ(ఏబీసీడీవో), చిక్కడపల్లి, శ్రీవిద్యా వికాస్ ట్రస్ట్(ఎస్‌వీవీటీ) ఆధ్వర్యంలో నవంబరు 9న రామాలయం పక్కనున్న నల్లకుంట కోపరేటివ్ కమ్యూనిటీహాల్‌లో విశ్వావసు నామ సంవత్సర కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏబీసీడీవో ప్రధాన కార్యదర్శి డా. ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. చండీహోమం, రుద్రాభిషేకం, సత్యనారాయణస్వామి వ్రతం, మహిళలచే సామూహిక కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు విశేషంగా లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఉదయం 6.30 గంటలనుంచి పూజలు ప్రారంభం అవుతాయని అనంతరం ముందుగా ఎంపిక చేసిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేస్తామన్నారు. చివరగా బ్రాహ్మణ కార్తీక సమారాధన జరుగుతుందని ఆసక్తి గల ఆస్తిక బ్రాహ్మణ బంధువులు ఈ పూజల్లో స్వయంగా పాల్గొనవచ్చునని ఆసక్తి గల వారు నవంబరు 1లోగా 9390646539, 9100414469, 9866154760, 9492877204 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆత్మాభిమాన నటీమణుల్లో జమున ప్రముఖులు



చాగంటి సాయిలక్ష్మికి పురస్కారం బహూకరిస్తున్న వంశీ రామరాజు తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమాల్లో ఆత్మాభిమానం కల నటీమణుల్లో జమున ప్రముఖులు అని అందుకే ఆమె సత్యభామ పాత్ర సమర్థవంతంగా పోషించగలిగారు అని వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు తెలిపారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రఖ్యాత నటి జమున 89వ జయంతి సందర్భంగా వంశీ జమున నటనా పురస్కారం చాగంటి సాయిలక్ష్మికి ప్రదానోత్సవ సభ జరిగింది. వంశీ రామరాజు పురస్కారం బహూకరించి మాట్లాడారు. జమున వంశీ సంస్థలను సొంత సంస్థలుగా భావించి పిలిచిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనేవారు అని గుర్తుచేసుకున్నారు. జమున రంగస్థల కళాకారుల శ్రేయస్సు కోసం కృషి చేశారన్నారు. రంగస్థలంలో విశేష కీర్తి పొందిన సాయిలక్ష్మికి జమున పురస్కారం ప్రదానం చేయడం సముచితం అన్నారు. సాయిలక్ష్మి టీవీ సీరియల్స్ నటిగా రచయిత్రిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వారు అని ప్రశంసించారు. తొలుత ఫణి, టీవీరావు, జేపీ శాస్త్రి, శ్రీధర్, లలిత, సవిత, రమణి తదితరులు జమున నటించిన సినిమాల్లో పాటలు మధురంగా ఆలపించారు.

తెల్లమచ్చలతో బాధపడుతున్న బాలుడు

- విద్యార్థులకు దూరంగా కూర్చోబెట్టిన ఉపాధ్యాయులు
- ఏడ్చుకుంటూ తల్లికి చెప్పిన బాలుడు
- కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి
- దళిత సంఘాల నేతలతో కలిసి తల్లి అరుణజ్యోతి పాఠశాల ఎదుట ధర్నా

బర్కత్‌పుర : తెల్లమచ్చలతో బాధపడుతున్న 5వ తరగతి చదువుతున్న బాలుడిని తరగతి గదిలో పిల్లలకు దూరంగా కూర్చోబెట్టారు. ఆ బాలుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. తోటి విద్యార్థులు దగ్గరకు రానివ్వకపోవడంతో కన్నీరుపెట్టుకుని ఆ బాలుడు జరిగిన విషయాన్ని తల్లికి చెప్పాడు. దీంతో తల్లి అరుణజ్యోతి దళిత సంఘాల నేతలతో కలిసి కాచిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వచ్చి గొడవకు దిగింది. దళితుడు కాబట్టే దూరంగా కూర్చోబెట్టి తీవ్రంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమారుడిని అంటరాని వాడిగా చూపి అవమానించిన ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది. ఎలాంటి ఫిర్యాదు తమకు రాలేదని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదు

చిక్కడపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని జవహర్‌స్కూల్‌ను నడుపుకోవడానికి 1966 సంవత్సరంలో అనసూయ అనే మహిళకు 350 గజాల స్థలాన్ని కార్మికశాఖ లీజుకిచ్చిందన్నారు. ఈ లీజును ఆమె తన కుటుంబీలకు జీపీఏ చేసిందన్నారు. పది సంవత్సరాలుగా అక్కడ పాఠశాల మూసివేశారన్నారు. మహిళ కుటుంబసభ్యుల నుంచి స్థానిక రాజకీయ నాయకుడు ఒకరు స్థలాన్ని తీసుకుని వ్యాపారసముదాయానికి వినియోగిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారులు గురువారం కార్మికశాఖకు సంబంధించిన స్థలంగా బోర్డును ఏర్పాటు చేశారన్నారు.

దొంగల అరెస్ట్ : 2 ద్విచక్రవాహనాలు స్వాధీనం

చిక్కడపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాల దొంగలను క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన అయిదుగురిలో ఇద్దరిని రిమాండ్‌కు పంపారు. ముగ్గురు మైనర్లను జువెనైల్ హోమ్‌కు పంపారు. గురువారం సాయంత్రం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, డీఐ శంకర్ నాయక్‌లతో కలిసి ఏసీపీ రమేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బాగ్‌లింగంపల్లిలో మెకానిక్ షాప్ నిర్వహిస్తున్న పి. నాగరాజు వద్దకు గుర్తుతెలియని వ్యక్తి ఒకరు వచ్చి మాటల్లోదింపి కష్టమర్‌కు చెందిన పల్సర్ బైక్‌ను చోరీ చేసి ఉడాయించాడు. బాధితుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వాహనాల తనిఖీ సందర్భంగా చోరీ చేసిన రెండు వాహనాలను అమ్మేందుకు గాను రాంనగర్‌లోని అమీర్ నివాసానికి చోరీ చేసిన వాహనాల పైనే వెళ్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీ వ్యవహారం మొత్తం బయటపడింది. మొత్తం 11 కేసుల్లో వారిని నిందితులుగా గుర్తించారు. ఈ సందర్భంగా మిద్దెల ఏడుకొండలు(18), మహ్మద్ అమీర్(35)లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. చోరీ చేసిన వాహనాలను మూడువేల నుంచి మూడువేల ఐదువందల రూపాయలు నిందితులకు ఇచ్చి కొనుగోలు చేసి వాటిని ఎక్కువ ధరకు అమ్ముకునే మహ్మద్ ఇజాజ్ అహ్మద్ పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలిస్తున్నట్లు ఏసీపీ వివరించారు. ఈ సందర్భంగా ఆటోమోబైల్ థెఫ్ట్ కేసులో నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న క్రైమ్ పోలీసులను ఏసీపీ అభినందించారు.



రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేసిన వాహనదారులకు చలాన్లు విధిస్తున్న గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి తదితరులు

రాంగ్‌రూట్‌లో వస్తే చర్యలు : ట్రాఫిక్ సీఐ

కవాడిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీజీవో టవర్స్ వద్ద గురువారం రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారులు, రోడ్లను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం మధ్యాహ్నం సీజీవో టవర్స్ వద్ద గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వాహనదారులు, ఫుట్‌పాత్ ఆక్రమణలు చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా అక్రమ పార్కింగ్ చేసి ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



బంద్‌లో పాల్గొనాలని హనుమంతరావును కోరుతున్న జేఏసీ

42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు

రాంనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, బీసీ బంద్‌లో పాల్గొంటానని మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించే బంద్‌లో పాల్గొనాలని కోరుతూ తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు కే.పీ.మురళీకృష్ణ, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్‌లు గురువారం బాగ్‌అంబర్‌పేటలోని వీహెచ్ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ బీజేపీ వల్లే రిజర్వేషన్లు నిలిచిపోతున్నాయని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. బంద్‌లో పార్టీ నాయకులు, బీసీలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధన్‌రాజ్‌యాదవ్, లింగం పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో నవీన్‌యాదవ్‌ను గెలిపించాలి

నల్లకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అగ్రవర్ణ అభ్యర్థులపై ప్రజలు గుణపాఠం చెప్పాలని, బీసీ వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కే.పీ మురళీకృష్ణ కోరారు. గురువారం హైదర్‌గూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను జూబ్లీహిల్స్‌లో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. గత కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినట్లుగా జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేడు రక్తదాన శిబిరం

చిక్కడపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సెంట్రల్‌జోన్ పోలీస్ విభాగం పరిధిలోని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో రక్తదాన శిబిరం జరుగుతుందని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్, డీఐ శంకర్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, జాయింట్ సీపీ తఫసీర్ ఇక్బాల్, సెంట్రల్ జోన్ డీసీపీ ప్రవల్లిక, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ అతిథులుగా పాల్గొంటారని వివరించారు. రక్తదానం చేసి ఒకరి ప్రాణాలను కాపాడాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

బంగారు ఆభరణాలు, నగదు తస్కరణ

బర్కత్‌పుర, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికుడి బంగారు ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురకు చెందిన వినోద్ సజావత్(34) బిక్కనూర్ కాచిగూడ స్పెషల్ రైలులో నగరానికి వస్తుండగా కామారెడ్డి వద్ద ట్రాలీబ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో పది గ్రాముల బంగారు ఆభరణాలు, 20వేల నగదు ఉంది. గురువారం వినోద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

రైల్వే టీసీ బ్యాగును తస్కరించిన దొంగలు

రైల్వే టీసీ బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే టీసీ సురేందర్‌కుమార్ గురువారం చర్లపల్లి - ఆదిలాబాద్ రైలు ఎక్కారు. నిజామాబాద్ వద్ద తన బ్యాగును సీటులో పెట్టి కిందకు దిగాడు. తిరిగి వచ్చే సరికి బ్యాగు కనిపించలేదు. ఆ బ్యాగులో ఈఎఫ్‌టీ బుక్స్, మనీరిసిప్ట్స్, పాన్‌కార్డు, ఏటీఎం కార్డు ఉన్నాయి. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362